# కథ

# విలసిత

బి.పి.కరుణాకర్

**మా** స్వస్థలం విడపలపాడు. ఇప్పుడు అక్కడ మా పొలాలు తప్ప ఏమీ లేవు. చాలా సంవత్సరాల నుండి వాటిని కౌలుకిచ్చాం. వాటి తాలూకు డబ్బులు ఎప్పుడో గాని చేతికి రావు. తెచ్చి ఇవ్వరు. అంత దూరం వెళ్లి తెచ్చుకుంటూ ఉండాలి. ఆ పొలాల్ని ఎంతో కొంతకు అమ్మేద్దామనుకుందామని చాలాసార్లు అనుకున్నాను. ఆ అనుకోవడం అనుకోవడంగానే మిగిలిపోయింది.

కౌలు తాలూకు డబ్బులు వసూలు చేసుకుని నేనూ, నా స్నేహితుడు సలీం విడపలపాడు నుండి ఆ మధ్యాహ్నం రెండు గంటలకు ఒంగోలు మీదుగా హైదరాబాద్ కారులో చేరుకోవాలి. ఒంగోలులో మూడు నాలుగు గంటల పని. ఆ పని కొద్దిగా ఆలస్యమయినా తెల్లవారేసరికి హైదరాబాద్‌లో ఉండాలి. నాకు పనుల వత్తిడిలో తీరిక తక్కువగా ఉంటుంది. ఒక్క రోజుకు అడుగు బయటకు వేస్తే చాలా పనులు.నిలుచుండిపోతాయి. సెలవులు నేనూహించని విషయం.

విడపలపాడు దాటి ఆరేడు కిలోమీటర్లు వచ్చి ఉంటాం. రోడ్డుకు కొద్దిగా దూరంగా పాత పెంకుటిల్లు కనిపించగానే కారాపమని సలీంతో అన్నాను. రోడ్డుపక్కగా కారాపాడు. తలుపు తెరిచి కారు దిగాను. సలీం కూడా దిగి, "ఏవిటి విశేషం?" అడిగాడు.

రెండు రోజులు జరిగితే క్రిస్మస్ వస్తుంది. చల్లటి గాలి రెపరెప వీస్తోంది.

"ఆ పెంకుటింటికి వెళ్దాం" అన్నాను.

సలీం వొళ్లు విరుచుకుని, "అది మీదా?" అడిగాడు. అతనా ఊరు నాతో రావడం అదే మొదటిసారి.

"ఒకప్పుడు, ఇప్పుడు దాని మీద మాకు హక్కులేమీ లేవు. మా తాత దాన్ని మిషనరీ ఎయిడెడ్ స్కూలుకిచ్చాడు. ప్రభుత్వం స్కూళ్లకు ఎయిడ్ తీసేశాక టీచర్లు, టీచర్లతో పాటు పిల్లలూ తగ్గిపోయారు. స్కూలు మూసేశారని విన్నాను. ఇప్పుడు పిల్లల నవ్వులూ కేరింతలూ వినబడుతున్నాయి. తిరిగి స్కూలు తెరిచారేమో.వెళ్లి చూసొద్దాం." రోడ్డుదాటి స్కూలు ఆవరణలోకి నడిచాం.

ముఖ ద్వారం గోడకు ఆనించి 'అనాథ శరణాలయం' అన్న బోర్డు ఉంది. దానికింద ప్రభుత్వేతర సంస్థ పేరు ఉంది. ఆ బోర్డు ముఖద్వారం మీదకు ఎక్కించలేదు. ఇంటికి, ప్రహరీ గోడకు సున్నం కొట్టి పాత కళను వంటబట్టిస్తున్నారు. తాతయ్య ఉండగా ఆ ఇల్లు ఎంతో కళగా ఉండేదని అమ్మ నాతో చాలాసార్లు అంది. చూచాయగా తప్ప నాకు అంతగా గుర్తు లేదు. ఇప్పుడు తాతయ్య లేడు. అమ్మ లేదు. అక్కయ్య ఇంగ్లాండులో స్థిరపడిపోయింది. పదీ పదిహేను సంవత్సరాలున్న పిల్లలు రెండు జట్లుగా విడిపోయి సరివిచెట్ల క్రిస్మస్ స్టార్లు పెట్టి రంగు రంగుల కాయితాలతో అలంకరిస్తున్నారు. పిల్లల్లో ఉత్సాహం కనిపిస్తోంది.

వరండా దగ్గరకు చేరుకున్నామో, లేదో లోపల నుంచి నలభయి సంవత్సరాలున్న ఒకమె వచ్చి నమస్కరిస్తూ ఆగింది. ప్రతి నమస్కారం చేస్తూ మెట్ల దగ్గర ఆగాను. ఆమె వెనకనే వంటలక్క అనుకుంటాను, బయటకు వచ్చి గోడకు ఆనుకుని నిలబడింది.

"నా పేరు వీరాబాయి... ఈ ఆశ్రమం కేర్ టేకర్‌ను" అంది. సన్నగా, పొడుగ్గా చామనచాయలో ఉంది.

"పిల్లలు క్రిస్మస్ ట్రీ అలంకరిస్తోంటే చూసి వెళ్దామని వచ్చాం" అన్నాను.

*ఇంటికి, ప్రహరీ గోడకు సున్నం కొట్టి పాత కళను వంటబట్టిస్తున్నారు. తాతయ్య ఉండగా ఆ ఇల్లు ఎంతో కళగా ఉండేదని అమ్మ నాతో చాలాసార్లు అంది. చూచాయగా తప్ప నాకు అంతగా గుర్తు లేదు. ఇప్పుడు తాతయ్య లేడు. అమ్మ లేదు. అక్కయ్య ఇంగ్లాండులో స్థిరపడిపోయింది. పదీ పదిహేను సంవత్సరాలున్న పిల్లలు రెండు జట్లుగా విడిపోయి సరివిచెట్ల క్రిస్మస్ స్టార్లు పెట్టి రంగు రంగుల కాయితాలతో అలంకరిస్తున్నారు. పిల్లల్లో ఉత్సాహం కనిపిస్తోంది*



"మీరు విడపలపాడులో ఉంటున్నారా?"

"లేదండీ. హైదరాబాద్‌లో ఉంటున్నాం" అని నా పేరు చెప్పి సలీంను పరిచయం చేసి, "ఇక్కడ ఎంత మంది పిల్లలుంటారండీ?" అడిగాను.

"ప్రస్తుతానికి ఇరవయి ఎనిమిది మంది ఉన్నారు. బయటే నుంచుండిపోయారు. లోపలికి రండి" అంటోంటే మా ఇంట్లోకి నన్నే ఆహ్వానించినట్లనిపించింది. వరండాలోకి రాగానే వంటలక్క రెండు కుర్చీలు తెచ్చింది. నేను, సలీం కూర్చున్నాం.



వీరాబాయి మాటలు వింటూ పది నిమిషాలేమో ఉండి తర్వాత లేచి బయల్దేరబోతోంటే, "మా శరణాలయం చూడండి" అంది.

కాదనలేదు. అప్పట్లో ఎలా ఉండేదో నాకంతగా గుర్తు లేదు. అప్పటి రెండూ మూడు జ్ఞాపకాలు తలకు మూలరాయిలా ఇంకా ఉన్నాయి. ఆ ఇంటిని అన్ని వసతులతో పదిహేను గదులుగా చేశారు. ప్రతి గదిలో రెండు మంచాలున్నాయి. గదులు శుభ్రంగా ఉన్నాయి. మూసి ఉన్న చివరి గది చూపించడానికి వీరాబాయి ఎంచాతనో ఆసక్తి చూపించలేదు.

కుతూహలం వెనక్కి నెట్టలేక, "ఆ గది?" అని ఆమె ముఖంలోకి చూశాను.

"అది విలసిత గది..." అని అయిష్టంగా తలుపు నెట్టి, నాకు మటుకు వినిపించేలా, "ఆ పాపకు కేన్సరు" అంది వీరాబాయి. నా మనసు జాలితో నిండిపోయింది.

లోపలికి నడిచాను. మంచం మీద పడుకుని ఏదో పుస్తకం చదువుకుంటున్నదల్లా పుస్తకం మూసి దిండు పక్కన ఉంచి లేవడానికి ప్రయత్నించింది. వీలు కాలేదు. స్టూలు మంచానికి దగ్గరగా

**విలసితను క్రిస్‌మస్ ట్రీ దగ్గరకు తీసుకువెళ్లి కుర్చీ వేసి కూర్చోబెట్టి, అందరితో అన్నాను, "ఇవేల్టి నుండి మీరందరూ విలసితతో మాట్లాడాలి. ఆటలాడాలి. సరే అంటే మీకేమేమి బహుమతులు కావాలో తెచ్చి ఇస్తాను".**

లాక్కుని కూర్చుని, "ఎలా ఉన్నావు విలసితా?" అడిగాను.

నవ్వింది. తల మీద జుట్టు పలచగా ఉంది. మనిషి సన్నగా, తెల్లగా ఉంది. అసలు వయసు ఎంత ఉంటుందో తెలియదుగాని పదిహేనేళ్ల అమ్మాయిలా కనిపిస్తోంది. తల లావుగా ఉంది. విలసిత చేతులు నా చేతుల్లోకి తీసుకుని, "అందరూ క్రిస్మస్ ట్రీ అలంకరిస్తోంటే నువ్వొక్కదానివే ఇక్కడ ఉండిపోయావు" అన్నాను.

మెల్లగా లేచి కూర్చోబోతుంటే సహాయం చేశాను. "వాళ్లెవరూ నాతో ఆడడానికి ఇష్టపడరు" అంది. ఎందుకని నేను అడగలేదు. విలసిత నిస్సహాయత గుర్తు చేయడం నాకు ఇష్టం లేదు.

"క్రిస్మస్ అంటే నీకిష్టంలేదా?" అడిగాను.

"ఎందుకు లేదు? బాగా ఇష్టపడతాను. మీ పేరు చెప్పలేదు". చెప్పాను. సలీంను కూడా పరిచయం చేశాను.

"మీరీ ఊళ్లోనే ఉంటున్నారా?"

"లేదు. హైదరాబాద్‌లో ఉంటాను. నీ గురించి వీరాబాయి ఆంటీ చెబితే చూసి వెళ్దామని వచ్చాను" అన్నాను ఆ పిల్ల తల నిమురుతూ.

"నిజం చెప్పమంటారా? నన్ను చూడడానికి డాక్టర్లూ, నర్సులు తప్ప వేరెవ్వరూ రారు. నాకెవరూ లేరు. నా చిన్నప్పుడు మా అమ్మ నన్ను వదిలి వెళ్లిపోయింది. నాన్న ఎవరో తెలియదు. ఎవరూ లేకపోవడం ఎంత బావుంటుందో తెలుసా? ఎవరూ నా గురించి బాధపడనవసరం లేదు. నేనెవరి గురించి ఆలోచించాల్సిన అవసరం ఉండదు. కదూ?" గుండెలు బద్దలు కొట్టుకోలేని బాధ గూడు చెదరకుండా ఉంది. ఆమె కళ్లల్లో నీరు కదలలేదు. గొంతులోంచి దుఃఖం తొంగిచూడలేదు. విలసితను దగ్గరకు తీసుకుని నుదుటి మీద ముద్దులు పెట్టుకుంటున్నప్పుడు నన్ను చుట్టేసుకుంది.

తర్వాత విలసితను క్రిస్‌మస్ ట్రీ దగ్గరకు తీసుకువెళ్లి కుర్చీ వేసి కూర్చోబెట్టి, అందరితో అన్నాను, "ఇవేల్టి నుండి మీరందరూ విలసితతో మాట్లాడాలి. ఆటలాడాలి. సరే అంటే మీకేమేమి బహుమతులు కావాలో తెచ్చి ఇస్తాను". సరే అన్నారు అందరూ. ఎవరికి ఏమేమి కావాలో సలీం కాయితం మీద రాసుకున్నాడు. మేం బయల్దేరబోతోంటే వీరాబాయి మాకూడా గేటు వరకు వచ్చింది. "మా మూలాన మీకు అనవసరమయిన ఖర్చు" అంది.

"ఏం లేదు. నా సంతోషంకొద్దీ తెస్తున్నాను... విలసితను ఆస్పత్రిలో చేర్పించకూడదూ?" అడిగాను.

వీరాబాయి బాధగా నవ్వి, "మూడు నెలల కిందటి వరకు ఆస్పత్రిలో ఉంది. టెర్మినల్ డిసార్జ్ చేశారు. విలసిత మహా అయితే నెల బతుకుతుంది. అంతకంటే ఎక్కువ కాదు. చాలా రోజుల తర్వాత మిమ్మల్ని చూశాక నవ్వింది..." అంటోంటే నా హృదయాన్ని తీసి చుట్ట చుట్టి రోడ్డుకు అవతల ఉన్న ముళ్లపొద మీద విసిరినట్టు అనిపించింది.

ఒంగోలు వెళ్లి పిల్లలకు కావలసినవన్నీ తెచ్చి పేరు పేరున అందరికీ ఇచ్చి వాళ్లతో కలిసి భోజనం చేసి వెళ్లిపోబోతూ డబ్బు ఇవ్వబోతోంటే వీరాబాయి డబ్బు తీసుకోలేదు. "డబ్బులు తీసుకోకూడదండీ. మా సంస్థ పేర చెక్కు రాసివ్వచ్చు" అంది. చెక్కు రాసిచ్చి అక్కడి నుండి బయల్దేరేసరికి తొమ్మిది దాటింది.

అరగంట ప్రయాణం చేశాక, "కారాపు" అన్నాను. సలీం కారాపాడు.

ఆ క్షణంలో నా మనసులో కదిలిన మూలరాయి- ఆ అర్థరాత్రి నాన్న, అమ్మ, అక్క, నేను ఆ ఊరు వదిలి వెళ్తున్నప్పుడు అక్కకు పుట్టిన అయిదు నెలల పిల్లను అమ్మ దుప్పట్లో భద్రంగా పెట్టి నాకిచ్చి "ఎవరూ చూడకుండా పొలాల్లో పెట్టేసి వచ్చేయి" అంది. అప్పటికి అక్కకు పెళ్లి కాలేదు. ఆ చిన్నపిల్ల తల విలసిత తలలా పెద్దగా ఉండడం నాకు ఇప్పటికీ గుర్తుంది-

ఎప్పటి సంగతో అది!

•